

# చెట్టంత మనిషి

'అమ్మాయ్ నేనింకా యెందుకు బతికి వున్నానంటావ్... సమాధానం కూడా నేనే చెపుతాను....విను...చావలేక చావటంచేతకాక. కాదు... కాదు చావటం యిష్టంలేక. అవును నేనెందుకు చావాలి. అభగవంతుడు పిలిచిననాడు, ఎవరువుండమన్నా, ఒక్క క్షణం వుండను. ఇవాళ వీళ్ళు నన్నింతమాట అంటారా, ఈనాటికి నేను బరువైపోయానా' నవారు మంచంలో అటూ యిటూ మసలుతూ ఆయాస పడుతున్నాడు, రంగనాథం.

'.. వాళ్ళెవ్వరి మాటలు లెక్కచెయ్యకండి మావగారు మీ కేలోపం రాకండా చూసేదాన్ని నేవున్నాగా...' కంటతడి తుడుచుకుంది అనసూయ.

'ఎవ్వరిచేతా ఒక్కమాట అనిపించుకోవటం నాకిష్టంలేదు. నేనువాళ్ళకు ఏదో మహోపకారం చేశానని ఎన్నడూ అనుకోలేదు. ప్రతితండ్రీ చేసేపనే నేనూ చేశాను. మమకారాన్ని, మమతను పెంచుకోలేకపోయాను. ఆ ఫలితమే వాళ్ళను యింతవాళ్ళను చేసింది. ఇది నాతప్పా... నేను వాళ్ళదగ్గర్నుంచి యేమీ ప్రతిఫలం కోరటంలేదే. వాళ్ళకు నేనంటే యింతద్వేషం యెందుకు! ముసలాడు యింకా యెన్నాళ్ళు బతుకుతాడు అంటారా! ఇదేనా, తండ్రిని అనాలసినమాట...అమ్మాయి. డాక్టర్ని పిలుచుకు రావద్దన్నారా ఏమిటి...ఏడీ యింకారాడే, యిప్పుడే వస్తాడని చెప్పావు...'

'కాదండీ, నేనేవెళ్ళి చెప్పాను, ఎవరో రోగుల్ని చూస్తున్నారు, యిప్పుడేవస్తానదమని చెప్పాడు ...' అనసూయ మాటలు తడబడ్డాయి.

'ఏడుస్తున్నావ్, వెర్రిపిల్లా, నేను చచ్చిపోతా ననుకుంటున్నావా? ఆ భయమేం లేదు...'

'అదుగో డాక్టరుగారు వస్తున్నారు' గభాలునలేచి నిలబడింది అనసూయ.

'అయ్యా, వచ్చారా. మీ కోసమే ఎదురుచూస్తున్నాను. ఇంత సేపు చేశారేమండి, మాకోడలు మీదగ్గరికొచ్చి ఏవేళ అయింది నాకు జబ్బు నయమవుతుందంటారా...' ఆదుర్దాగా లేచి నిలబడ్డాడు రంగనాథం.

'కూచోండి...ఆవేశపడకండి. ఆయాసం యెక్కువవుతుంది. ఏదీ చెయ్యి... పడుకోండి.మీ వయస్సెంత వుంటుంది?' గుండె పరీక్షచేస్తూ, డాక్టరు అడిగాడు.

'నావయస్సుతో మీ కేం పనండి, నాజబ్బువిషయం చూడండి. అయితే మావాడు మీతో మాట్లాడాడన్నమాట. ఇంకా మీరు నన్నేం బతికిస్తారు. ఇహ మీరు వెళ్ళండి...' ఆ మాఠంతం లేవబోయాడు, రంగనాథం.

'మావగారు, మీరుకాసేపు పడుకోండి. డాక్టరుగారు మిమ్మల్ని యేమీ మాట్లాడద్దంటున్నారు...' ఆయనచేతులు పట్టుకుని, మంచంమీదనుండి లేవకండా చేసింది, అనసూయ.

'వాడికీ అంతే, నేను మాట్లాడటం యిష్టంలేదు' మెల్లిగా అన్నమాటలు, అనసూయమాత్రం విన్నది.

'ఏమిటి అంటున్నారు. పాపం పెద్దవారు... ఏదో బాధపడుతున్నారు.. ఈ వయస్సులో వారి మనస్సుకు కష్టం కలిగేమాటలు...' డాక్టరుగారు యింకా పూర్తిచేయకమునుపే, 'ఎట్లావుందండీ' అన్నది గభాలున అనసూయ డాక్టరు ఆమె మొహంలోకిచూస్తూ, ఇంకాయేమీ అనలేక పోయాడు

ఇంజక్షను చేసి డాక్టరు వెళ్ళిపోయాడు రంగనాథం, కళ్ళుమూసుకుని పడుకున్నాడని, అనసూయ మెల్లిగా లేచి వచ్చేసింది.

'అసలు నీ ఉద్దేశమేమిటో నాకు అర్ధంకావటంలేదు. నేను వద్దన్నపని చెయ్యటమే నీలక్ష్యమైతే నేననేదేమీ లేదు...' గంభీరంగా భార్యమొహంలోకి చూస్తూ, అన్నాడు సూర్యారావు.

'మీరు ఏమివద్దన్నారు, నేను ఏం చేశాను...' కోపంగా అన్నది అనసూయ.

'డాక్టరుగారు జరిగిందంతా చెప్పారు. నాతండ్రిమీద నాకంటె నీకు యెక్కువ ప్రేమ వుంటుందంటావా...'

'అవును. అంత ప్రేమగలవారు కాబట్టే యింకాయెన్నాళ్ళు బతుకుతాడు అని తేలిగ్గా అనగలిగారు. మావగారు మీమాటలు విన్నారు తెలుసా మీకు...'

'ఆయనవినాలనే అక్కడ అన్నది. అబద్ధమా నేనన్నది ఇంతవయస్సులో యింకా బతికిఏంసాధించాలి? ఎవరిని ఉద్ధరించాలి? మనంఎక్కడికి వెళదామన్నా, యీయన



ఆ కీచక పాత్రధారి మహాబలుడంటే విన్నారా? ఇహనైనా బుద్ధితెచ్చుకోండి. నాటకాలాడటం మానేయండి.

ఒకపెద్ద అద్దం. వదిలిపెట్టి వెళ్ళటానికి వీల్లేదు. మనతోపాటు తీసుకువెళ్ళటానికి అంతకంటే వీల్లేదు. ఈ విషయం ఆయనే గ్రహించుకుంటే యెంత బాగుంటుంది, ఇది నాచేత చెప్పించాలా. ప్రతి జీవితానికి ఒక లక్ష్యంవుంటుంది. ఒక ప్రయోజనం వుంటుంది. ఇవి అయిపోయిన తర్వాత ఇంకా ఒక్క క్షణం బ్రతికివున్నా వృధా, అనవసరమన్న మాట. నువ్వు అర్ధం చేసుకోలేవు నా ఆవేదన, నాభావం, నీమనస్సుకు పట్టవు. అంతే...'

'అయితే ఏమంటారు మీరు? నామతి పోతోంది. మీరనేదేమిటో స్పష్టంగా చెప్పండి.' కళ్ళువిలిపి ఆయాస పడుతోంది అనసూయ.

'నువ్వెంతగా మొహం చింపుకోనక్కర్లేదు. నీకు యిప్పటికీ అర్థంకాకపోతే, యింకావిడమర్చి చెప్పినా ఉపయోగం లేదు. నువ్వుచేసేదంతా వృధా. డబ్బుదండగ, పాయిలోపోసిన పన్నీరు మోస్తరు. ఆయనింకా బతుకుతాడనుకోవటం, డబ్బు కుమ్మరించి బతికించాలనుకోవటం శుద్ధ తెలివితక్కువ. నీమొండి పట్టుదలకు అర్ధంలేదు...' విసురుగా యిట్లోంచి వెళ్ళిపోయాడు సూర్యారావు

గబగబా, అనసూయ, మామగారి మంచందగ్గరకువెళ్ళి నిలబడింది ఆయన మొహంలోకే చూస్తూ.

ఆయన కనుబొమ్మలు కదులుతున్నాయి. పెదిమలు పైకి క్రిందకు ఊగుతున్నాయి. నుదురుమీద చెమట

బిందువులు మెల్లి మెల్లిగా చేరుకొంటు న్నాయి. మొహం విప్పారుతున్నట్టు కని పిస్తోంది. క్రింద పెదిమను ఒకపంటితో గట్టిగా నొక్కిపట్టి, అట్లా గే చూస్తూ నిలబడింది, అనసూయ.

'అమ్మాయి మంచినీళ్ళు' అన్నాడు రంగనాథం మెల్లిగా పక్కలో ఒదుగుతూ.

చప్పున గ్లాసుతో నీళ్ళు తీసుకు వచ్చింది. ఆయన దాహంతీర్చుకున్నారు.

'డాక్టరుగారు వెళ్ళిపోయూరా. ఇట్టే నిద్రపట్టింది. ఒళ్ళుతెలీలేదు. నాకు జబ్బు నయమవుతుందన్నారా...నేనింకా బతకాలని ఆశపడుతున్నానని ఆయనతో చెప్పావామరి. ఆయన ఏమన్నారు చెప్పమ్మా...' మొహం తుడుచుకుంటూ, మంచంలోంచి లేవబోయాడు.

'మీకు జబ్బేమీలేదన్నారండి ...' ఆయన మొహంలోకి సూటిగా చూసింది, అనసూయ.

పెద్దపెట్టున నవ్వాడు రంగనాథం. ఉలిక్కిపడింది అనసూయ, 'మరి ఇంజక్షను యెందు కిచ్చాడు. ఎవరక్కడ! ఎవరో వచ్చినట్టున్నారు చూడు.'

గిర్రున వెనక్కు తిరిగింది అనసూయ. వాసునుచూసింది, ఒక్క క్షణం ఆగి, యిప్పుడే వస్తానంటూ ముందుకు సాగింది.

'ఆడదానివంటే నువ్వేనమ్మావదినా' నవ్వుతూ అన్నాడు వాసు.

'అందుకనేగా మీ అన్నయ్యగారు నన్ను పెళ్ళి చేసుకుంది...' వెదుక్కోకుండా అనేసింది అనసూయ.

'అదినరేలేవమ్మా...మా యిద్దరికీ యిష్టంలేకపోయినా, నువ్వే డాక్టరుగార్ని పిలుచుకువచ్చి, మా వగార్కి మందు లిప్పించి, ఊరంతా మంచి అనిపించుకున్నావు. ఈమాత్రం మేం చేయలేకపోయినామా! ఇంతకీ మమ్మల్ని నలుగుర్లో మాటలు అనిపించటానికేగా, ఆ డాక్టరుగారు ఏమన్నారో తెలుసా...' కాస్తంత ఉద్రేకపడ్డాడు వాసు.

'తెలుసుకుని నేనేంచేస్తానని, నాతో చెప్పటం...'

'అయినా నీతోవాదనెందుకులే...మా అన్నయ్యేక్కడ ?'

'వెళ్ళేచోట్లన్నీ, నాకుచెప్పే వెళుతున్నారా !...'

'ఓహో అదా సంగతి. యింకా యింట్లోనే వున్నాడనుకుంటున్నా' గడప దాటాడు వాసు.

'నువ్వెక్కడికి వెళుతున్నావో చెప్పి వెళ్ళు నాయనా, మీ అన్నయ్యగారు రాగానే మాతమ్ము డెక్కడికి వెళ్ళాడని అడుగుతారేమొ ..' వ్యంగ్యంగానే అన్నది అనసూయ.

ఉరకలువేస్తూ సాగిపోయాడు వాసు.

'ఏవంటాడు వాడు' మంచంలోంచి రంగనాథం బిగ్గరగా అరిచాడు.

'మీవిషయం కాదులెండి. పడుకోండి'



దగ్గరగా వెళ్ళి మెల్లిగా అన్నది అనసూయ.

రంగనాథం మంచంమీద పడుకుని, కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు రావిచెట్టు కనిపించింది. ఆ రావిచెట్టు యీనాటిదికాదు. ఎన్నో ఏళ్ళక్రిందట నాటిన చిన్న మొక్క. అదే యీనాడు మహావృక్షంఅయి ఎంతోమందికి ఆశ్రయాన్నిస్తోంది. ఆ చెట్టును ఆసరాచేసుకుని ఎన్నోపక్షులు గూళ్ళను కట్టుకున్నాయి. ఇతరత్రా ఆశ్రయంలేని స్వేచ్ఛాజీవులు ఆ చెట్టుకిందే కాలాన్ని గడుపుకుంటున్నారు.

ఆఊరుకూడా రావిచెట్టుతోపాటే పెద్దదయిపోయింది. సభ్యతా ప్రపంచంలోకి చొచ్చుకుపోవటానికి ఆఊరు ఎప్పటికప్పుడు తహతహ లాడుతూనే వుంటుంది. ప్రజల మనస్తత్వాల్లో మార్పులు జొరబడ్డాయి ప్రేమ, ఆప్యాయతల స్థానాల్లో అవసరం, అవకాశాలు చోట్లు చేసుకుంటున్నాయి. ఫ్యాక్టరీ యంత్రాలు రావటంతోనే, మనిషి ఆలోచనకూడా యాంత్రికమయి పోతున్నట్లుంది ఆఊరికి యింకాయేదో చెయ్యాలని, మార్పు తీసుకురావాలని, ఆఊరి ప్రజ విపరీతంగా ఆలోచిస్తోంది ఏం చెయ్యాలన్నా, ఓపెద్ద ఆటంకంగా కనిపిస్తోంది ఆ రావిచెట్టు! మొక్కను నాటిన మనిషికి రాబోయే మార్పులను గురించిన ఊహ లేక పోయింది! ఈ రావిచెట్టు పెద్ద అభివృద్ధి నిరోధక శక్తిగా పరిణమించింది! దీన్ని తీసెయ్యాలనే అభిప్రాయం చాలమందికి కలిగినప్పటికి, బైటికి చెప్పటానికి మాత్రం భయపడుతున్నారు కాకపోతే ఓ నవయువకుడు, ఆవేశంతో దీన్ని కొట్టేస్తేసరి అన్నాడు. రంగనాధం ఆచెట్టును చూస్తూ వుంటే, ఆనాడు ఆయువకుడన్న మాటలు స్ఫురణకు వచ్చినాయి. గుండెమీద చెయ్యిపెట్టుకుని ఎంతమాట అన్నాడు అనుకున్నాడు.

తన శరీరంలోకి డెబ్బైఏళ్ళు వచ్చిపడ్డాయి. నునుపుగావున్న శరీరంకాస్త, ముడతలు పడిపోయింది. అవయవాలు ఆధీనంలో లేకుండా పోతున్నాయి. మనిషిలో సత్తువంతా లాగేసింది తనకూ ఎంతో బలంగంవుండి దూరాన యిద్దరు కొడుకులున్నారు. కూతుళ్ళు తలొకదేశాన వెళ్ళిపోయారు దగ్గరవున్న కొడుకుల [illegible] మహా దారుణంగా తయారయింది ఇన్నేళ్ళబట్టీ పొందిన అనుభూతి వేరు. ఈ మధ్యకాలంలో తాను అనుభవిస్తున్న బాధవేరు. ఆరావిచెట్టు చూస్తున్నంతసేపూ, తనకూ, ఆచెట్టుకూ ఏదోపోలిక, సంబంధంవున్నట్టు మనస్సులో ఆరాటపడుతున్నాడు.

'పళ్ళరసం తీసుకుంటారా...' అన్న మాటవిని, చప్పున కళ్ళుతిప్పాడు. తన ఆలోచనా ప్రవాహం ఆగిపోయినట్లనిపించింది. బిత్తరపోయి, అనసూయ వైపుచూస్తూ, 'ఊ..' అన్నాడు.

ఆనాడు కులాసాగా కబుర్లుచెప్పుతూ, అనసూయను, పిల్లలను నవ్విస్తున్నాడు రంగనాధం.

'నేచెప్పలా, నేను చచ్చిపోనని, నాకుతెలుసు. పూర్తిగా నయమయిందని డాక్టరుగారు చెప్పారు...'

'నాకూ ఆ నమ్మకంవుంది.' మెల్లిగా అన్నది అనసూయ

'మీరు కోలుకోవటంచూసి, మీపిల్లలు కూడా ఆశ్చర్యపోయారు' అన్నది అనసూయ. రంగనాధం నవ్వాడు.

'ఆశ్చర్యందేనికి! ఎట్లాకోలుకున్నాడా అనా!'

'కాదు కాదు. వాళ్ళమనస్సు మారింది. మిమ్మల్ని అన్నది తప్పని గ్రహించారు. కావి మీదగ్గరకువచ్చి, ఆమాట చెప్ప టానికి ధైర్యం చాలటంలేదు...అంతే' అన్నది అనసూయ.

రంగనాథం, కనుబొమ్మలు పైకి క్రిందకు ఎగరేస్తూ, కళ్లు మూసుకున్నాడు.

ఆయన ఏమంటాడో అని ఆదుర్దాగా చూస్తోంది అనసూయ. కళ్లు మెల్లిగా తెరిచి, 'అమ్మాయి అటు చూడు' అంటూ రావిచెట్టును చూపించాడు. మొహం చిట్లిస్తూ అనసూయ అటు వైపుకు చూసింది కాని ఏమీ అర్థంకాలేదు. రంగనాథం మాట్లాడలేదు.

రోజులు గడుస్తున్నకొద్దీ, సూర్యారావుకు, వాసుకు, తండ్రిఅంటే, భక్తి, గౌరవము, పెరిగిపోతున్నాయి. వాళ్ళు చూపిస్తున్న ఆప్యాయత, ప్రేమలకు రంగనాథం, ఉక్కిరిబిక్కిరయి పోతున్నాడు–నిభాయించుకోలేకపోతున్నాడు. ఉద్వేగం, ఆవేశం యెక్కువయి పోతున్నాయి.

ఆనాడు సాయంత్రం అందరూ వసారాలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. క్షణాల్లో గాలివేగం యెక్కువయింది. ఉరుములు మెరుపులతో ఫెళఫెళమంటోంది ఆకాశమంతా. గాలి తాకిడికి తట్టుకోలేక రావిచెట్టు విలవిలలాడుతోంది. రంగనాథం గభాలున కుర్చీలోంచిలేచి, ఆరావిచెట్టు వైపుకు చూస్తూ నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు. సూర్యారావు, వాసు యిద్దరూ అటు వైపుకేచూస్తూ ఆశ్చర్యపోయారు. గాలి జోరు ఎక్కువయింది. వానకూడా బాగానే సాగుతోంది. రంగనాథం ఆవేదనగా, ఆరాటంగా ఆరావిచెట్టువైపుకే చూస్తున్నాడు; ఆగాలివేగానికి రావిచెట్టు మొదలు కూడా ఊగిసలాడుతున్నట్లు కనబడుతోంది. రంగనాథం అటూ యిటూ తూలాడు. ఆయన ధ్యాసంతా ఆ చెట్టుమీదేవుంది. ఆ చెట్టు ఏమయి పోతుందో అనేబాధతో ఆరాటపడుతున్నాడు హృదయం బరువెక్కిపోతోంది. శరీరం వణికిపోతోంది. చూస్తూ చూస్తుండగానే, రివ్వున వీస్తున్న గాలి ఆచెట్టును, నాలుగువైపులా చుట్టేసింది గాలిమోతే గట్టిగావినిపిస్తోంది క్షణంలో ఫెళఫెళమనే ధ్వని వినిపించింది. అంతచెట్టూ నేలకు ఒరుగుతున్నట్లు రంగనాథం గమనించాడు

గుండె బాదుకుంటూ, 'రావిచెట్టు ఒరిగింది...' అని పెద్దపెట్టున కేకవేసి, గభాలున క్రింద పడిపోయాడు, రంగనాథం

'నాన్నా... నాన్నా...' అని గొంతు చించుకొని అరుస్తున్న సూర్యారావు వాసు కేకలు రంగనాథానికి వినిపించలేదు.